క్లుప్తంగా

నేడు బాపట్లలో దళిత ఆదివాసీల సదస్సు

మేదరమెట్ల: నేడు బాపట్ల ఎన్‌జీఓ హోమ్ నందు నిర్వహించే జిల్లా స్థాయి దళిత ఆదివాసీల సదస్సును విజయవంతం చేయాలని డీబీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం ఉదయం 10.30 నుంచి సదస్సు నిర్వహిస్తారని, ఈ సదస్సులో దళిత ఆదివాసీ మేనిఫెస్టోను విడుదల చేస్తారని ప్రకటనలో తెలిపారు.

వైకుంఠపురంలో ఉరుసు మహోత్సవం

చీరాల: ఈనెల 11న వైకుంఠపురంలో 52వ గంధం ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పత్యేక పార్థనల్లో పాల్గొనాలని కమిటీ తెలిపింది.

న్యాయవాది సుబ్బారెడ్డి మృతి బాధాకరం

చీరాల రూరల్: మంచికి మారుపేరుగా నిలిచి ఎంతోమందికి ఉచితంగా న్యాయ సహాయాన్నందించిన న్యాయవాది సుబ్బారెడ్డి మృతి బాధాకరమని న్యాయమూర్తులు, న్యాయవాదులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. చీరాల కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్న ఆసాది వెంకట సుబ్బారెడ్డి (43) శుక్రవారం మృతి చెందాడు. సోమవారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు అధ్యక్షతన వహించిన ఈ సభలో న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహానా, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్. నిషాద్ నాజ్‌లతో పాటు పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం

చీరాల: చీరాల పట్టణంలోని ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలోని ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జగనన్నే ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధులు సోమవారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, నియోజకవర్గ పరిశీలకుడు మురుగుడు హనుమంతరావు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి చీరాల పట్టణ పరిధిలోని పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు అందరూ హాజరుకావాలని కోరారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు

చీరాల: నియోజకవర్గంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఉదయం 9గంటలకు వేటపాలెం మండలం వేటపాలెం-1 సచివాలయంలో, 10 గంటలకు చీరాల మండలం ఈపూరుపాలెం-3 సచివాలయ పరిధిలో, 11 గంటలకు చీరాల పట్టణంలోని ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలో క్యాంపులు జరుగుతాయి. కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పాల్గొంటారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పొదుపు రుణాలు వినియోగించుకోవాలి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంతిపథం ఏపీఎం బీ సుబ్బారావు సూచించారు. మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో సోమవారం వీవోఏలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలను రూపొందించిందన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్ ఆసరా పథకానికి నాలుగు విడతలుగా పొదుపు మహిళలకు ప్రభుత్వం రూ.54 కోట్లు కేటాయించి పొదుపు మహిళల బ్యాంకు ఖాతాలకు జమచేశారన్నారు. సమావేశంలో సీసీ, సీవీలు, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరెలు పంపిణీ



చీరెలు పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వెంకటేశ్వర ఆర్యవైశ్య కల్యాణ మండపం గీతామందిరంలో 36 మంది పేద మహిళలకు చీరెలు అందజేశారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు గోరంట్ల లక్ష్మీనారాయణ అమ్మమ్మ వడ్లమూడి చినదెమ్మ జ్ఞాపకార్థం చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ,సెక్రటరీ చప్పిడి వీరయ్య, కొల్లా భువనేశ్వరీ, ఉబ్బా దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, సందిరెడ్డి శ్రీనివాసరావు, జాగర్లమూడి శివకుమారి, నర్రా శ్రీలక్ష్మీ, తమ్మన శ్రీనివాసరావు, పసుపులేటి ఆంజనేయులు, అంజాద్‌బాషా, చందులూరి కృష్ణ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. కొండంత అండ



తూర్పు కొప్పెరపాడులో వైద్య సేవలు పర్యవేక్షిస్తున్న కృష్ణచైతన్య

● రోగుల నుంచి విశేష స్పందన

జే.పంగులూరు/బల్లికురవ/మేదరమెట్ల: జగనన్న ఆరోగ్య సురక్ష మరో అధ్యాయమని ఏపీ శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కృష్ణచైతన్య సందర్శించి, అక్కడ డాక్టర్లు రోగులతో మాట్లాడారు. ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా చూడాలని సంబంధిత వలంటీర్లకు, ఏఎన్‌ఎంలకు సూచించారు. గ్రామీణ ప్రాతంలో ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. 405 మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ ఎనికపాటి కళ్యాణి శ్రీనివాసరావు, టీ తక్కెళ్లపాడు సర్పంచ్ మేడూరి అంజియ్య, ఎంపీటీసీ నూతలపాటి సింధూర అజిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజినేయులు, ఎంఈఓ వీరాంజినేయులు, విస్తరణ అధికారి రాంబాబు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

■ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష గ్రామాల వారీగా జరుగుతున్న క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని బల్లికురవ ఎంపీడీవో సీహెచ్ కృష్ణ అన్నారు. కొణిదెన గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 360 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కే లేపాక్షి విష్ణు, సెక్రటరీ జీ. సీతా మహాలక్ష్మీ పాల్గొన్నారు.

■ గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని కొరిశపాడు మండల ఎంపీపీ సాధినేని ప్రసన్న కుమారి అన్నారు. తిమ్మనపాలెం గ్రామంలో జేఏఎస్‌లో ఆమె పాల్గొని మందులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో సురేష్‌బాబు, డాక్టర్లు నాగమణి, అనీష్, పృథ్వీ, రాజేష్, సర్పంచ్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

పావులూరులో 275 మందికి పరీక్షలు..

యద్దనపూడి/ఇంకొల్లు (చినగంజాం): పావులూరు-2 గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 275 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్యాంపును గ్రామ సర్పంచ్ రావిపూడి వేణుబాబు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. క్యాంపును ప్రత్యేకాధికారి రమేష్‌బాబు, ఎంపీడీఓ రాజ్యలక్ష్మిలు, ఈఓఆర్డీ శ్రీనివాసరావులు పర్యవేక్షించారు. డాక్టర్ సాజన్‌విజయన్, వినయ్‌కుమార్, అంజలీ, రాజేష్‌కుమార్‌లు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకట్రావు, హెల్త్ ఎడ్యుకేటర్ అనురాధ, ఎంపీహెచ్‌ఈఓలు, హెచ్‌వీలు, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్‌నర్సులు, ఎల్‌టీలు, ఏఎన్‌ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

■ యద్దనపూడి మండలంలోని గన్నవరం జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో వైద్యపరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ కృష్ణకుమారి తెలిపారు. ఈశిబిరంలో 518 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చుండి లక్ష్మీనారాయణమ్మ, వైద్యాధికారులు సుభాషిణి, నిహారిక, అఖిల్, విశాల్, హరికష్ణ, వీరబాబు, వినితా, వీరేంద్ర, లక్ష్మీగౌరి, ఈఓఆర్డీ శ్రీనివాసరావు, ఎంఈఓ గోపి, సర్పంచ్ పల్లెపోగు అన్నమ్మ, ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్, కార్యదర్శి ప్రభాకర్, సీడీపీఓ సుభద్ర, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వేటపాలెం: స్థానిక సచివాలయం-2 పరిధిలో జరిగిన వైద్య శిబిరంలో వైద్యులు 648 మంది వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో వైద్యాధికారి శ్యాంసన్, కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, వైద్య సిబ్బంది పర్యవేక్షించారు.



తిమ్మనపాలెంలో మందులు అందజేస్తున్న ఎంపీపీ ప్రసన్నకుమారి



కొణిదెనలో జరిగిన క్యాంపులో రోగిని పరిశీలిస్తున్న వైద్యాధికారి



పావులూరులో వైద్య సేవలకు వచ్చిన వృద్ధులు, మహిళలు



గన్నవరంలో మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది



వేటపాలెం వైద్య శిబిరంలో ఓపీ విభాగం

వైఎస్సార్ సీపీ సదస్సుకు హాజరైన నాయకులు



సీఎం సభకు హాజరైన నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్, ప్రతినిధులు

చీరాల: విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం ప్రతిష్టాత్మకంగా జరిగిన వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల సమావేశానికి చీరాల నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు బొనిగల జైసన్‌బాబు, రామసుబ్బులు, పార్టీ పట్టణ, మండలాల అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, వివిధ పదవుల్లో ఉన్న ప్రతినిధులు హాజరయ్యారు.

కారంచేడు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన విజయవాడలో నిర్వహించిన సభకు పర్చూరు నియోజకవర్గం నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్, మార్కెటింగ్, కోఆపరేటివ్ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ రావి పద్మావతి, జెడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, ఎంపీపీ వాసుబాబు, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పీ శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కటుకూరి బాబూరావు, జిల్లా ఎస్‌ఎం కో కన్వీనర్ సామ్యేలు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ బాబులుతోపాటు, ప్రతి మండలానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఇద్దరు వైస్ ఎంపీపీలు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, మండల పార్టీ అధ్యక్షులకు ప్రత్యేక ఆహ్వానాలను పార్టీ కార్యాలయం నుంచి పంపించారు.



సదస్సుకు వెళ్లిన పర్చూరు నియోజకవర్గ నాయకులు

కాన్షీరాం సేవలు స్ఫూర్తిదాయకం



కాన్షీరాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

చీరాల రూరల్: బహుజన సమాజ్ వాది పార్టీ వ్యవస్థాపకుడు, బహుజన రాజ్య నిర్మాత కాన్షీరాం 17వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్‌లో ఉన్న కాన్షీరాం విగ్రహానికి నాయకులు పూల మాలలేవేసి ఘనంగా నివాళులర్పించారు. బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలుకన్న బహుజన రాజ్యాధికారాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌లో బీఎస్పీ ద్వారా కాన్షీరాం నిజంచేసి చూపించారని కొనియాడారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్రచేసి ఉత్తర్‌ప్రదేశ్‌లో నాలుగు సార్లు మాయావతిని ముఖ్యమంత్రిని చేశారన్నారు. దేశంలో ఉన్న 85 శాతం బహుజనులు ఐకమత్యంతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్, దుడ్డు భాస్కరరావు, కాటి మార్కు, చిట్టిమాల సంగీత రావు, చీమకుర్తి వంశీకృష్ణ, కుంచాల పుల్లయ్య, డేనియల్ ప్రసాద్, పృధ్వీరాజ్, పాస్టర్ దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో జగనన్నకు బ్రహ్మరథం



సమస్యలు తెలుసుకుంటున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య

● గడప గడపలో ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: రాష్ట్రంలోని ప్రజలు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో పాలనకు గ్రామగ్రామాన బ్రహ్మరథం పడుతున్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. సోమవారం ఉప్పుమాగులూరు-1 సచివాలయ పరిధిలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఎస్టీ, ఎస్సీ, బీసీ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలతోపాటు ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని తెలుసుకున్నారు. కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఇతర రాష్ట్రాల సీఎంలు సైతం ఇక్కడ పథకాలకు ఆకర్షితులవుతున్నారు. స్వర్ణయుగం తలపించేలా పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీకి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తే పార్టీని బలోపేతం చెయ్యవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, సర్పంచ్ పసుమర్తి మహాలక్ష్మమ్మ, స్థానిక నేత దేవినేని కృష్ణబాబు, బీ లక్ష్మారెడ్డి, టీ. సుబ్బారావు ఒంటరి వెంగయ్య, సరిమళ్ల సురేష్, బీ. వెంకటరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



ధర్నా నిర్వహిస్తున్న వాడరేవు ప్రజలు

చీరాల టౌన్: వాడరేవు గ్రామంలోని చిన్నబరప, పెద్ద బరప ప్రాంతాల్లో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న నిరుపేదలు అందరికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఆదుకోవాలని ఏఐటీయూసీ నాయకులు మేడా వెంకటరావు, బీసీ ఫెడరేషన్ నాయకులు వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు వాడరేవు ప్రాంత నిరుపేదలతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం వద్ద నివేశన స్థలాల కోసం ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు వాడరేవు ప్రాంత నిరుపేదలు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు బాబూరావు, పైడయ్య, రాజశేఖర్, శ్రీమన్నారాయణ, పాల్, ప్రకాష్, తదితరులు ఉన్నారు.

వెంకటేశ్వర వైభవ రథయాత్రకు స్వాగతం



రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు

చినగంజాం: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటేశ్వర వైభవ రథయాత్ర సోమవారం మండల కేంద్రమైన చినగంజాంలోకి ప్రవేశించింది. వెంకటేశ్వరుని రథం చినగంజాంలోకి ప్రవేశిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక మహిళా భక్తులు రథానికి ఎదురేగి ఘన స్వాగతం పలికారు. రథం చినగంజాం గ్రామంలోని ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించారు. వీధుల వెంట భక్తులు స్వామి వారి రథానికి హారతులు పట్టారు. కార్యక్రమాన్ని హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు పర్యవేక్షించారు. రథాన్ని చూసేందుకు భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. కార్యక్రమంలో స్థానిక మహిళా సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కారంచేడు: గ్రామ పంచాయతీల పరిధిలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేయనున్న గ్రామ పంచాయతీ అభివృద్ధి సూచికపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఎంపీడీఓ డీ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పంచాయతీల అభివృద్ధిపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సర ప్రణాళిలను తయారు చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనకు (ఎస్డీజీఎస్) సంబంధించి ప్రతి గ్రామంలో పేదరిక నిర్మూలన, శానిటేషన్, తాగునీటి వసతులు, చైల్డ్ డెవలప్‌మెంట్, క్లీన్ అండ్ గ్రీన్ వంటి తొమ్మిది రకాల ప్రణాళికలపై పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేసి మండలస్థాయి కమిటీకి పంపించాల్సి ఉంటుందన్నారు. కమిటీ సభ్యులు వాటిలో ఏమైన అవసరాలు ఉంటే వాటిని మార్పులు చేసి డివిజన్ స్థాయికి, అక్కడ నుంచి జిల్లాస్థాయికి అప్‌లోడ్ అవుతాయన్నారు. వాటిని బట్టి వచ్చిన నిధులతో, ఆయా గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రమేష్‌బాబు, ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏటీఎం పద్ధతితో రైతు ఆదాయం



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పర్చూరు (కారంచేడు): ఏటీఎం (ఎనీ టైం మనీ)ల ద్వారా రైతన్నలకు ఎంతో మేలు చేకూరేలా ప్రణాళికలు తయారు చేసినట్లు ప్రకృతి వ్యవసాయ విభాగం పర్చూరు క్లస్టర్ మాస్టర్ ట్రైనర్ సీహెచ్ అప్పారావు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని నూతలపాడు, కారంచేడు మండలం ఆదిపూడి గ్రామాల పరిధిలో ప్రకృతి వ్యవసాయంపై డెమో నిర్వహించారు. ఈ ఏటీఎం ద్వారా ప్రజలకు పోషకాలు అందించేలా ఉంటుందన్నారు. ఒక రైతు పొలంలో 0.20 సెంట్ల స్థలంలో ప్రతి నాలుగు అడుగులకు ఒక అడుగు కాలువ, మూడు అడుగుల బోదెలను తయారు చేసుకోవాలన్నారు. అందులో ఆకుకూరలు, దుంపజాతి, కూరగాయలు, తీగజాతి, పండ్ల మొక్కలు, కొత్తిమీర, పుదీన వంటి అన్ని రకాల మొక్కలను నాటాల్సి ఉంటుందన్నారు. ఇవి 30 రోజుల నుంచి ఒక్కో రకం పంట దిగుబడులు మొదలవుతాయన్నారు. ఇలా 365 రోజుల పాటు పంట దిగుబడుల వచ్చేలా ప్రణాళికలుంటాయన్నారు. ఇలా గ్రామాల్లో రైతులు, ప్రజలు సొంతంగా ప్రకృతి వ్యవసాయంలో మంచి దిగుబడలు, లాభాలు గడించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీను, పద్మజ, లలితమ్మ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మార్టూరు: అక్రమంగా నిల్వ ఉంచిన 8 మద్యం బాటిళ్లను పర్చూరు ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ యశోధరా దేవి తమ సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి మండలంలోని జొన్నతాళి గ్రామంలో స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో కూల్ డ్రింక్ షాపు యజమాని తవ్వా మధు అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నాడనే ముందస్తు సమాచారంతో అధికారుల తనిఖీ చేశారు. అందులో భాగంగా షాపులోని బీరువాలో దాచి ఉంచిన నాలుగు ఫుల్ బాటిళ్లు, నాలుగు క్వార్టర్ బాటిళ్లను మొత్తం ఎనిమిది బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

67 వాహనాలకు 12న వేలం

దర్శి: ఒంగోలు ఉపరవాణా కమిషనర్ ఆదేశాల మేరకు పన్నులు చెల్లించకుండా తిరుగుతూ రవాణా శాఖ తనిఖీల్లో పట్టుబడి సీజ్ చేసిన 67 వాహనాలకు ఈ నెల 12వ తేదీ దర్శిలోని ఎంవీఐ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు మోటారు వాహనాల తనిఖీ అధికారి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొదిలి ఆర్టీసీ డిపోలోని 27 వాహనాలు, కనిగిరి ఆర్టీసీ డిపోలోని 31 వాహనాలు, దర్శి అగ్నిమాపక కార్యాలయంలోని 3 వాహనాలు, మార్కాపురం ఆర్టీసీ డిపోలోని 2 వాహనాలు, గిద్దలూరు ఆర్టీసీ డిపోలోని 2 వాహనాలు, కంభం పోలీస్‌స్టేషన్‌లో ఒక వాహనంకు బహిరంగ వేలంపాట జరుగుతుందన్నారు. వాటిలో 20 ఆటో రిక్షాలు, 13 లైట్ గూడ్స్ వాహనాలు, 4 మ్యాక్సీ క్యాబ్‌లు, ఒక ఈఐబీ, ఒక ట్రాక్టర్, 28 మోటారు సైకిళ్లు ఉన్నట్లు తెలిపారు.

కారు, బైకు ఢీ

ముండ్లమూరు: కారు, బైకు ఢీకొని ఇద్దరు యువకులకు స్వల్ప గాయాలైన సంఘటన మండల కేంద్రమైన ముండ్లమూరులో సోమవారం చోటుచేసుకుంది. విజయవాడ నుంచి ప్రొద్దుటూరు వెళ్తున్న కారు మార్గంమధ్యలో ముండ్లమూరు వద్ద ఎస్సీకాలనీ నుంచి ద్విచక్ర వాహనంపై రోడ్డుపైకి వస్తున్న పోకూరి శ్రీను, గొర్రెముచ్చు బ్రహ్మజీలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై వెళ్తున్న ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. కారు కింద బైకు ఇరుక్కుపోయి దెబ్బతింది.

అదుపుతప్పిన లారీ

కంభం: ఎదురుగా వస్తున్న ట్రావెల్స్ బస్సును తప్పించబోయి లారీ అదుపుతప్పి హైవే పక్కనే ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని ఢీకొట్టిన సంఘటన సోమవారం తెల్లవారు జామున ఒంటిగంట సమయంలో జరిగింది. వివరాలు.. కంభం వైపు నుంచి మార్కాపురం వెళ్తున్న ఓ లారీ జంగంగుంట్ల గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ట్రావెల్స్ బస్సును తప్పించబోయి పక్కనే ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని, ఆ పక్కనే ఉన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఢీకొట్టి పక్కనే ఉన్న టీదుకాణంలోకి దూసుకెళ్లి ఆగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు.

రూ.10 లక్షలతో చప్టా నిర్మాణం ప్రారంభం

కురిచేడు: మండలంలోని పడమరవీరాయపాలెం నుంచి వినుకొండ రోడ్డులో చప్టా నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఇక్కడ చప్టా కూలిపోయి సుమారు రెండు సంవత్సరాలైంది. గ్రామ సర్పంచ్ బొరిగర్ల శివలక్ష్మి, మాజీ ఎంపీటీసీ బొరిగర్ల గోవిందు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి సమస్య వివరించగా, వారు స్పందించి జెడ్పీ గ్రాంటు నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు.

గడ్డికోత యంత్రం వితరణ



యంత్రాన్ని అందిస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు (కారంచేడు): మండలంలోని నూతలపాడు గ్రామ పంచాయతీకి అవసరమైన గడ్డిని కోసే యంత్రాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఉచితంగా అందించింది. సోమవారం నూతలపాడు గ్రామ పంచాయతీ వద్ద క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు చేతుల మీదగా గ్రామ కార్యదర్శి భీమినేని హరిప్రసాద్‌కు అందజేశారు. గడ్డి, కలుపు, నాచులను కత్తిరించే ఈ మిషన్ ద్వారా పంచాయతీకి ఎంతో ఉపయోగకంగా ఉంటుందన్నారు. బహూకరించిన క్లబ్ సభ్యులకు పంచాయితీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సధానంధరెడ్డి, భవనం రాజగోపాల్‌రెడ్డి, పాబోలు వెంకన్న, కారుమూడి సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ వణుకూరి బ్రహ్మరెడ్డి, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.